

ఎదుర్కోలు మహోత్సవం

కల్యాణానికి సిద్ధమైన వేదిక

కల్యాణానికి వేళాయే..

- నేడు నృసింహుడి కల్యాణం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- 'జగన్మోహినీ'గా దర్శనమిచ్చిన నృసింహుడు
- రాత్రి నేత్రపర్వంగా ఎదుర్కోలు మహోత్సవం

సకల జనవాళిపై కోటి సూర్యకాంతులు వెదజల్లుతూ.. తన కరుణా కటాక్షాలతో వెలుగులు విరాజిల్లే ఏకశిఖర వాసుడు.. యాదాచాల నృసింహుడితో.. సర్వజనులకు సిరి సంపదలు.. సుఖసంతోషాలు ప్రసాదించే శ్రీమహాలక్ష్మి అమ్మవారితో ముక్కోటి దేవతల సాక్షిగా నిర్వహించే కల్యాణ ఘడియలు దగ్గరపడ్డాయి. సోమవారం రాత్రి తులా లగ్నంలో 8.45 గంటలకు ప్రధానాలయ తూర్పు దిశలోని బ్రహ్మోత్సవ మండపంపై కల్యాణ తంతు నిర్వహించేందుకు ముహూర్తం నిర్ణయించారు. ఆదివారం ఉదయం స్వామివారు జగన్మోహినీ అలంకారంలో భక్తులను తన్మయపరిచారు. బ్రహ్మోత్సవ తిరుకల్యాణ సుముహూర్త నిర్ణయ ఘట్టం ఎదుర్కోలు మహోత్సవం రాత్రి ప్రధానాలయ తూర్పు తిరుమాఢ వీధిలో నేత్రపర్వంగా కొనసాగింది.

\- యాదగిరిగుట్ట

•7లో...



అంతంత మాత్రంగానే కాసిన కాయలు

మామిడి తోటలో రాలిపోతున్న పూత

ప్రతికూల వాతావరణంతో మామిడీలా

- రాలిపోతున్న పూత, పిందెలు
- తెగుళ్లబారిన పడుతున్న మామిడి తోటలు

ఓవైపు సరిపడా వర్షాలు లేవు. మరోవైపు తెగుళ్లు మామిడి రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాతావరణం కూడా అనుకూలించకపోవడంతో మొదటిలోనే పూత రాలిపోతోంది. దీంతో మామిడి చెట్లపై 40 నుంచి 50 శాతం మాత్రమే పూత మిగిలింది. దిగుబడుల కోసం రైతులు ఎకరాకు రూ.20వేల వరకు వెచ్చిస్తున్నారు. అయినా కూడా ఫలితం లేకుండా పోతోంది.

• నల్లగొండ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మామిడి తోటల రైతులు తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. మరికొన్ని రోజుల్లో మామిడి సీజన్ ప్రారంభంకానుండగా కాయ దిగుబడిపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణం అనుకూలించక పూత రాకపోవడం, ఆపై వచ్చిన పూత రాలిపోవడం, లేదంటే పిందె స్థాయిలోనూ నిలబడకపోవడంతో దిగుబడి పడిపోతోంది. గత ఏడాదితో పోలిస్తే పూత దశలో 40 నుంచి 50శాతం మాత్రమే మిగులుతోంది. గత కొన్నిరోజుల వరకు మంచు కురవడంతోపాటు కోడిపేను వంటి తెగుళ్ల బారిన మామిడి పడటంతో పూత రాలిపోయింది. పిందె లేకపోవడంతో కాయ తక్కువగా కనిపిస్తుంది. గత ఏడాది వర్షకాలం సైతం వానలు సరిగ్గా కురవపోవడంతో ఆ ప్రభావం తోటలపై తీవ్రంగానే ఉంది.

చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు

- ప్రస్తుతం మామిడి తోటలు సగభాగం పచ్చపూత, ఇంకొంత భాగం తెల్ల పూత, మరికొంత భాగం ఇంకా మొట్టెలతోటి (మొగ్గ దశలో) పూత విచ్చుకోకుండా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో తోటలకు తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి.
- చెట్టుకు తెల్ల, పచ్చ పూతకంటే మొట్టెలే (పువ్వు మొగ్గలు) అధికంగా ఉంటే మల్టీ-కే (13-0-45) 5 కిలోలు+సూక్ష్మ పోషక మిశ్రమం 2.5 కిలోలు+ ప్లానోఫిక్స్ 100 మి.లీ/500 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పచ్చపూత దశలో తేనె మంచు నివారణకు థయోమి తాక్సమ్ 200 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 80శాతం డబ్ల్యూ 150 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 100 మిల్లీ లీటర్లు, బూడిద తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 1లీ.+ వేపనూనె 2 లీటర్లు.. 500 లీటర్ల నీటిలో (ఒక డ్రమ్) కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పూత విచ్చుకున్నాక 10-15 రోజుల వరకు ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేయరాదు.
- తెల్లపూత చాలా సున్నితమైన దశ కాబట్టి తేనె మంచు పురుగు, బూడిద తెగులు, పిండినల్లిని వీలైనంత వరకు పచ్చపూత దశలోనే నివారించుకోవాలి.
- ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెలలో తప్పనిసరిగా యూరియా, పొటాష్, బోరాన్ ఎరువులు చల్లాలి. ఎరువులు ఎప్పుడైనా ఒకేసారి వేసేకంటే పలు దఫాలుగా వేసుకోవడం వల్ల దిగుబడి ఎక్కువగా వస్తుంది. పూత నుంచి పిందెలు ఏర్పడి బఠానీ గింజ సైజులో ఉన్నప్పుడు పదేళ్ల పైబడిన ప్రతీ చెట్టుకు, డీఏపీ-700 గ్రాములు, యూరియా 400 గ్రాములు, ఎంఓపీ 600 గ్రాముల చొప్పున ప్రతీ చెట్టుకి వేసి నీరు పెట్టాలి.
- బఠానీ గింజ సైజులో ఉండి పసుపు రంగులోకి మారి రాలిపోతుంటే మల్టీకే (13-0-45) 2.5 కిలోలు + సూక్ష్మ పోషక మిశ్రమం (ఫార్ములా-4) 2.5 కిలోలు + ప్లానోఫిక్స్ 100 ఎంఎల్‌లను 500 లీటర్ల నీటికి కలిపి ఆకులన్నీ తడిసేలా పిచికారీ చేసుకోవాలి.
- పండు ఈగ నివారణకు లింగాకర్షణ బుట్టలను (మిథైల్ యూజినాల్) ఎకరానికి 10 నుంచి 25 ఏర్పాటు చేసి ప్రతీ 20 రోజులకు ల్యూర్‌ను మారుస్తూ పంట పూర్తయ్యే వరకు కొనసాగించాలి.
- లాన్సర్ గోల్డ్ రెండు గ్రాములు, ఇండెక్స్ రెండు గ్రాములు, వేపనూనె 5మి.లీల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొలినేటర్స్ సంచార సమయంలో పిచికారీ చేయవద్దు.



ఉమ్మడి జిల్లాలో 26వేల ఎకరాల్లో సాగు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మామిడి తోటలు 26,014.98 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 11,968.78 ఎకరాల్లో మామిడి విస్తీర్ణం ఉండగా, సూర్యాపేట జిల్లాలో 11,886.20ఎకరాల్లో విస్తీర్ణం ఉంది. నల్లగొండ జిల్లాలో 2,160 ఎకరాల్లో మాత్రమే మామిడి తోటలు ఉన్నాయి. మామిడిపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంది. జనవరి, ఫిబ్రవరిలో చలి ఉండటంతో మంచువల్ల తోటలు తెగుళ్ల బారినపడ్డాయి. మంచుకు తోడు కోడిపేను, బూడిద తెగుళ్ల మామిడి తోటకు నష్టం చేస్తున్నాయి. రైతులు ఒక్కో ఎకరానికి రూ.20వేల వరకు సస్యరక్షణ చర్యలకోసం ఖర్చు చేస్తున్నారు. పురుగు మందులు అధికంగా వాడటంవల్ల ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం దిగుబడి మూడోవంతుకు పడిపోయే ప్రమాదం ఉందని, పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో రావో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిందె రాలిపోవడానికి కారణాలివే..

పిందె, పూత రాలిపోవడానికి నీరు, పోషకలోపమే కారణం. డ్రిప్ పైపులు అమర్చే పద్ధతి కూడా ఉత్పత్తిపై ప్రభావం చూపిస్తుంది. మధ్యాహ్నం ఎండలు ఎక్కువగా ఉండటంవల్ల పూత పిందెపై ప్రభావం చూపిస్తుంది. నీటి తడులు ఇచ్చేటప్పుడు మొదటి రెండు తడులు తేలికగా ఇచ్చిన తర్వాత మాత్రమే మూడోతడి పూర్తిగా ఇవ్వాల్సి వస్తుంది. లేదంటే పూత గాని, పిందే గాని రాలిపోయే ప్రమాదం అధికంగా ఉంటుంది.



చెట్లకు నీటిని సమృద్ధిగా పెట్టాలి

వేసవి తీవ్రత దృష్ట్యా మామిడి చెట్లకు నీటిని సమృద్ధిగా అందించాలి. పిందె రాలిపోకుండా ఉండటానికి యాజమాన్య పద్ధతులను అవలంబించాలి. మంచు సమయంలో పిందె చాలావరకు రాలిపోయింది. పంట దిగుబడులను కాపాడుకోవడానికి రైతులు చెట్లకు నీరు పెట్టాలి. అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ, మామిడి తోటలను కాపాడుకొని అధిక దిగుబడులు సాధించాలి.

అనంతరెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 19,715మంది విద్యార్థులు
- పరీక్ష ప్రారంభమైన 5 నిమిషాల వరకు అనుమతి



జిల్లా కేంద్రంలోని ఓ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ, మార్చి 17: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ప్రతీ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 26వ తేదీన సైన్స్ పార్ట్-1(భౌతికరసాయనశాస్త్రం), 28వ తేదీన సైన్స్ పార్ట్-2(జీవశాస్త్రం) పరీక్షలను మాత్రం ఉదయం 9.30గంటల నుంచి 11.30గంటల వరకు నిర్వహించనున్నారు. అదేవిధంగా వచ్చే నెల 1వ తేదీన జరిగే ఒకేషనల్ కోర్సు(థియరీ) పరీక్షను ఉదయం 9.30గంటల నుంచి 11.30గంటల వరకు నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం 19,715మంది విద్యార్థులు హాజరు కానున్నారు. అందులో 19,302మంది రెగ్యూలర్ విద్యార్థులు కాగా, 413మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. పరీక్ష కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సౌకర్యంతో పాటు ఫ్యాన్లు, లైట్లు ఇతర సౌకర్యాలు కల్పించారు.

5నిమిషాల వరకు అనుమతి

విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తారు. పరీక్ష ఉదయం 9.30కు ప్రారంభం కానుండగా, ఉదయం 9.35గంటల వరకు పరీక్ష కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతిస్తారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ అమలు చేయడంతోపాటు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష సమయంలో ఆయా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసేలా కంట్రోల్‌రూం ఏర్పాటుచేశారు. పరీక్ష విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా ఐడెంటీ కార్డును ధరించాలి. విద్యార్థులతో పాటు సిబ్బంది పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లకూడదు. విద్యార్థులు ఏవైనా ఇబ్బందులు ఉంటే సెల్ నంబర్ 9121212513లో సంప్రదించాలని డీఈవో కోరారు.

విద్యార్థులు ఇవి పాటించాలి..

- విద్యార్థులువారికి కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ఒక్క రోజు ముందే వెళ్లి చూసుకోవాలి.
- పరీక్ష కేంద్రానికి గంట ముందు అంటే ఉదయం 8.30గంటలలోపు చేరుకోవాలి.
- విద్యార్థులు పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్, ప్యాడ్, బ్లూ, బ్లాక్ పెన్‌ను తీసుకుని వెళ్లాలి.
- విద్యార్థులు తమకు ఇచ్చిన ప్రశ్నాపత్రం సరైనదా లేదా అని చూసుకోవాలి.

విద్యార్థులు చేయకూడనివి..

- విద్యార్థులు స్కూల్ యూనిఫాం ధరించి పరీక్ష కేంద్రానికి హాజరు కాకూడదు.
- డిజిటల్ చేతి గడియారాలు, సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లకూడదు.
- హాల్‌టికెట్ నంబర్‌ను మెయిన్ ఆన్సర్‌షీట్, అడిషనల్ ఆన్సర్ షీట్, గ్రాఫ్, మ్యాప్, బిట్ పేపర్లతో సహా ఎక్కడా రాయకూడదు.
- విద్యార్థులు వారి పేరు, సంతకం, ఏ విధమైన గుర్తింపు చిహ్నాలు, స్లోగన్లు ఆన్సర్ షీట్‌లో రాయకూడదు.
- పరీక్ష సమయం పూర్తయ్యే వరకు విద్యార్థులు కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్

కలెక్టర్ దాసరి హరిచందన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

నల్లగొండ, మార్చి 17: కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి శనివారం నుంచి పకడ్బందీగా అమలుచేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్ 18న పార్లమెంట్ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందని, 25న నామినేషన్ దాఖలుకు చివరి తేదీ అన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. జిల్లాలో మొత్తం 1,766పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 46 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామనిన్నారు. 30 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు, 30 మహిళా నిర్వహణ పోలింగ్ కేంద్రాలు, 6యూత్ పోలింగ్ కేంద్రాలు, మరో 6 పీడబ్ల్యూడీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 14.9లక్షల మంది ఓటర్లు ఉండగా, 7.35లక్షల పురుష ఓటర్లు, 7.54లక్షల మహిళా ఓటర్లు ఉన్నారని, కొత్తగా 52 వేల మంది ఓటర్లు నమోదయ్యారని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఆదివారం నుంచి ఎన్నికల వ్యయం లెక్కలోకి వస్తుందని, ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాల వంటివి నిర్వహించకూడదని తెలిపారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదులను సీ-విజిల్ యాప్ లేదా, 1950 నెంబర్‌కు తెలియజేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సుమారు 20 నోడల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ముందస్తు అనుమతి లేకుండా సమావేశాలు ర్యాలీలు నిర్వహించకూడదని, 'సువిధ' ద్వారా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరైనా రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లాల్సి వస్తే కచ్చితమైన ఆధారాలను వెంట ఉంచుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా స్వాధీనం చేసుకున్న నగదును సాక్ష్యాలు చూపించిన తర్వాత జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఫిర్యాదుల కమిటీ ద్వారా విడుదల చేస్తామన్నారు. శాంతిభద్రతలకు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రూపొందించినట్టు పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌వో డి.రాజ్యలక్ష్మీ, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీపీఆర్‌వో యు.వెంకటేశ్వర్లు, మీడియా రిలేషన్స్ నోడల్ అధికారి, ఇండస్ట్రీస్ జీఎం కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనల ప్రసారాలు నిలిపివేయాలి

పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున అన్ని టెలివిజన్ ఛానళ్లు, వార్త పత్రికల్లో ప్రభుత్వ పథకాలపై ప్రకటనలు ప్రసారం చేయడం, ప్రచురించడం నిలిపివేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాజకీయ ప్రకటనలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయవద్దన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

జిల్లాలో పార్లమెంటు ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన కోరారు. ఆదివారం కలెక్టరేట్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల వ్యయ నిర్వహణలో భాగంగా రాజకీయ పార్టీలు పాంప్లెంట్లు, పోస్టర్లు తదితర వాటికి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. వాటిలో ఎదుటివారిని, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ముద్రిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ, నామినేషన్ల సందర్భంగా మూడు వాహనాలకు మించి వినియోగించరాదన్నారు. ప్రైవేట్ ఆస్తుల ఆవరణను ఏదైనా ప్రచారానికి వినియోగిస్తే సదరు ఆస్తి యజమాని ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను 72 గంటల్లో పూర్తిగా తీసివేస్తామని తెలిపారు. ఏదైనా ర్యాలీ తీయాల్సి వస్తే 10 వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని, ఆపై వాహనాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ ఏర్పాటులో ఉద్యోగ, ఉపాధ్యాయులది కీలక పాత్ర

పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య

నల్లగొండ టౌన్, మార్చి 17: ప్రభుత్వ ఏర్పాటులో ఉద్యోగ, ఉపాధ్యాయులది కీలక పాత్ర అని పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, సుంకరి భిక్షం గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదోన్నతులు, ఇతర సమస్యలు పదేళ్లుగా పేరుకుపోయాయని, కొత్త ప్రభుత్వం వాటిని పరిష్కరిస్తుందని ఉపాధ్యాయులు ఆశగా ఎదురుచూస్తున్నారని అన్నారు. 317 జీవోతో ఎంతోమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు అభద్రతాభావానికి లోనయ్యారని, ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడానికి రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు సీనియారిటీ ప్రాతిపదికగా తీసుకోవడంతో కొందరు స్థానికతను కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కమిటీ నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశామని తెలిపారు. మ్యూచువల్ అవకాశం ఇస్తే కొంత సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టిస్తే సమస్య పూర్తిగా సమసిపోతుందని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, దీన్ని అమలు చేయాలని కోరారు. 23 ఏళ్లుగా ఉపాధ్యాయులు పదోన్నతులు లేకుండా ఒకే క్యాడర్లో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. మార్చి తర్వాత వేలాది మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందే అవకాశం ఉందని, దీంతో పాఠశాలల్లో పోస్టులు ఖాళీ ఏర్పడతాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వేసవిలోనే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరారు. 2011లో ఏర్పడిన పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం, తెలంగాణ ఉద్యమంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుందని, దీన్ని జీర్ణించుకోలేని కొందరు సంఘాన్ని బదనాం చేయడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బైలా ప్రకారం తమ సంఘానికి ప్రతీరెండేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయని, గత డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో తాము ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యామన్నారు. ఈ విషయాన్ని జీఏడీకి వెంటనే అందజేశామని తెలిపారు. గతంలో తమ సంఘాన్ని ప్రభుత్వం గుర్తించి ఓడి సౌకర్యాన్ని కూడా కల్పించిందన్నారు. ఎన్నికల్లో అధ్యక్షులుగా పోటీ చేసి ఓడిన వారు తామే బాధ్యులమని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్‌సీ.రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్‌గౌడ్, ధర్మానాయక్, బాదం భిక్షపతి, అద్దంకి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడికి తీవ్రగాయాలు

పెన్‌పహాడ్, మార్చి 17: రోడ్డు ప్రమాదంలో ఓ దివ్యాంగుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెన్‌పహాడ్ ఎస్‌ఐ పెరిక రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దూపహాడ్ గ్రామానికి చెందిన కొప్పోజు గోపాచారి పుట్టుకతోనే దివ్యాంగుడు. శనివారం రాత్రి దుపహాడ్ గ్రామంలో గోపచారి కిరాణం దుకాణానికి వెళ్లి, ఇంటికి రావడానికి రోడ్డు దాటుతుండగా గరిడేపల్లి నుంచి సూర్యాపేటకు కోళ్ల దాణా లోడుతో వెళుతున్న టీఎస్25టీ3179 నెంబరు గల లారీ అతి వేగంగా వస్తూ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ ముందు టైర్లు గోపచారి కాళ్లపై నుంచి వెళ్లడంతో కాళ్లు నుజ్జునుజ్జయి తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితిని గమనించి డ్రైవర్ లారీని ఘటనా స్థలంలోనే వదిలిపెట్టి పరారయ్యాడు. గ్రామస్థుల సాయంతో కుటుంబ సభ్యులు 108అంబులెన్సులో గోపాచారిని సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. గోపాచారి దంపతులకు కుమార్తె ఉంది. భార్య శ్రీహర్షిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

తిరుమలగిరి రూరల్, ఆత్మకూర్(ఎస్), మద్దిరాల, మార్చి 17: సూర్యాపేట జిల్లాలో తాటిచెట్లపై పైనుంచి పడి ఓగీత కార్మికుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తిరుమలగిరిఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్నగౌడ్(41) ఆదివారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్నగౌడ్ దంపతులకు కుమార్తె ఉంది. వెంకన్నగౌడ్ మృతదేహానికి తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుమార్తెకు నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

వెంకన్నగౌడ్ కుమార్తె పదో తరగతి చదువుతోంది. సోమవారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో తండ్రి అకాల మృతి చెందడంతో ఆకుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబ దిక్కుతోచని స్థితిలో ఉందని ప్రభుత్వం రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని గుండెపురి గ్రామానికి చెందిన పలువురు కోరారు.

మరో ఇద్దరికి గాయాలు

● ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో ఆత్మకూర్(ఎస్)మద్దిరాల మండలాల్లో గీత కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు యరగాని వెంకన్న కల్లు గీయడానికి శనివారం రాత్రి తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంకన్నను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

● మద్దిరాల మండలంలోని పోలుమళ్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు మమూనూరి శ్రీను గ్రామ శివారులో కల్లు గీయడానికి ఆదివారం తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడిన శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. శ్రీనును 108అంబులెన్సులో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

హుజూర్‌నగర్, మార్చి 17: కుటుంబంలో జరిగిన ఘటనలకు మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన పంగ సైదులు(48)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో చిన్న కుమారుడు మృతి చెందాగా, భార్య మూడేళ్ల క్రితం చనిపోయింది. దీంతో సైదులు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఉదయం మద్యం తాగి గ్రామశివారులో ఉన్న మామిడి తోటలోకి వెళ్లి పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించి బంధువులకు సమాచారం ఇచ్చారు.

వెంటనే బంధువులు సైదులును హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సైదులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సైదులు పెద్దకుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవయవదానం

రాజాపేట, మార్చి 17: యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన ఎమ్మ యాదగిరి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన తల్లిదండ్రులు ఆదివారం అవయవదానం చేశారు. నర్సాపూర్ గ్రామానికి చెందిన ఎమ్మ కొమురయ్య విజయ దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఎమ్మ యాదగిరి(20) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. వారం రోజుల క్రితం ఇంటికి వచ్చి వెళ్తుండగా యాదగిరిగుట్ట వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. యాదగిరి కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని జీవన్‌దాన్ సంస్థ నిర్వాహకులు యాదగిరి తల్లిదండ్రులను అవయవదానం కోసం అవగాహన కల్పించారు. యాదగిరి తల్లిదండ్రులు కుమారుడి అవయవాలను అవయవదానం చేసేందుకు ఒప్పుకున్నారు. దీంతో గుండె, కిడ్నీలు, కాలేయం, కంటి పొరలను ట్రస్ట్ సభ్యులు సేకరించారు.

'జగన్మోహినీ'గా దర్శనమిచ్చిన నృసింహుడు

యాదగిరికొండపై బ్రహ్మోత్సవ శోభతో



ఆలయ తిరువీధుల్లో అలంకారసేవ ఊరేగింపు, పాల్గొన్న భక్తులు



యాదగిరిగుట్ట, మార్చి17: జగద్రక్షుడు.. స్వయంభు పాంచనారసింహుడు.. యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి తిరుకల్యాణ బ్రహ్మోత్సవ విశేష ఘట్టాలతో యాదాచల దివ్యక్షేత్రం ఆదివారం మహోత్సవ శోభను సంతరించుకుంది. వేద పండితులు, అర్చకబృందం, రుత్వికుల వేద పారాయణాలు, హోమ పూజలు, అలంకార సేవలతో పాటు ఆధ్యాత్మికత సందడి నెలకొంది. తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో ఎదుర్కోలు జరిగే రోజున స్వామివారు జగన్మోహినీ అలంకారంలో భక్తులను తన్మయ పరిచారు. సర్వజగత్తులోని సకల జీవరాశిని తనవైపు ఆకర్షించడానికి.. దుష్టశిక్షణ.. శిష్ట రక్షణకు అవతార పురుషుడు లక్ష్మీనృసింహుడు 'జగన్మోహిని' దివ్య సుందరరూపంలో అలరింపజేశారు. పట్టుపీతాంబరాలు, బంగారు, వజ్ర, ముత్యాలను పొదిగిన దివ్యాభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ముగ్ధమనోహర జగన్మోహిని అలంకార మూర్తుల సేవ ముందు పారాయణీకులు, పండితులు, అర్చకులు వేద మంత్రోచ్ఛరణలు, మూలమంత్ర జపస్తోత్ర పఠనాలు జరపగా.. ఆస్థాన విద్వాంసులు మంగళ వాయిద్యాలు మోగిస్తుండగా భక్త జనులు గోవింద నామ స్మరణ నడుమ ఆలయ తిరువీధుల్లో అలంకార సేవ ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. ప్రధానాలయ తూర్పు రాజగోపురం ముందు అలంకారసేవకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'స్వామివారే పరమాత్మ' ప్రజలందరూ జీవాత్మలు అనే భగద్గీతలోని సారానికి అనుగుణంగా నారసింహుడిని జగన్మోహిని దివ్యాలంకరణలో దర్శించుకున్న భక్తులు ఆనంద పరవశం చెందారు. ఈ వైదిక కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యులు, అర్చకబృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు పాల్గొన్నారు.

యాగశాలలో హవన పూజలు

యాదగిరికొండపై అంగరంగ వైభవంగా జరుగుతున్న లక్ష్మీనరసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో ఉదయం, సాయంత్రం ప్రధానాలయ యాగశాలలో హోమ పూజలు నిర్వహించారు. మండపంలో రుత్వికులు మూలమంత్ర జపాలు, వేద పారాయణాలు చేస్తూ యాగం నిర్వహించారు.

శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ప్రభాతభేరి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతబేరి వైదిక పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ప్రభాతవేళ వేదపారాయణాలతో స్థానిక శ్రీవైష్ణవస్వాములు, రుత్వికులు స్వామిని కొలుస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం అనాదిగా వస్తున్న ఆచారం.

స్వామివారికి టీటీడీ మేల్చాట్ పట్టువస్త్రాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున ఆదివారం యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడికి వార్షిక బ్రహ్మోత్సవాల్లో కల్యాణ పట్టువస్త్రాలు(మేల్చాట్) ఉప కార్యనిర్వహణాధికారి లోకనాధం,పర్యవేక్షకులు సురేష్, అర్చకులు మురళిలు సంప్రదాయరీతిలో అందజేశారు. ముందుగా టీటీడీ అధికారులు, అర్చకస్వాములు బ్రహ్మోత్సవ కల్యాణ పట్టువస్త్రాలను తీసుకుని ప్రధానాయలం చుట్టూ ప్రదక్షిణచేసి ముఖమండపంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావుకు అందజేశారు. ముందుగా స్వామివారిని జగన్మోహినీ అలంకారసేవలో టీటీడీ బృందం పాల్గొంది.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ అధికారులు

కొండపై యాత్రాజనుల సందడి

యాదగిరిక్షేత్రంలో ఆదివారం యాత్రాజనుల సందడి నెలకొంది. వారాంత పు సెలవు రోజు, దేవదేవుడి బ్రహ్మోత్సవాలు కొనసాగుతుండడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తజనులు పెద్ద సంఖ్యలో ఇష్టదైవాల దర్శనాల కోసం తరలివచ్చారు. కొండపైన ఆలయ తిరువీధులు, ప్రసాదాల విక్రయశాల, దర్శన క్యూలైన్లు, కొండకింద పట్టణ ప్రధానవీధులు, ఘాట్‌రోడ్ ప్రాంతాలు భక్తులతో కోలాహలంగా కనిపించాయి. స్వామి వారి ధర్మదర్శనాలకు 3గంటల సమయం, ప్రత్యేక దర్శనాలకు 1గంట సమయం పట్టినట్టు, సుమారు 30వేలకు పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించినట్టు, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.42,59,584 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా స్వామికి నిత్యారాధనలు పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు గర్భాలయంలోని స్వయంభువులను, ప్రతిష్ఠా అలంకారమూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడి నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.





ఆలయం వద్ద నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణులు



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఆలయ ఈవో, ఉద్యోగులు, అర్చకులు

ఏకశిఖరవాసుడి సన్నిధిలో
నేడు బ్రహ్మోత్సవ తిరుకల్యాణం

» ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు » ఘనంగా ఎదుర్కోలు మహోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి 17: ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టం తిరుకల్యాణాన్ని దేవస్థాన అర్చక,రుత్విక, వేదపండితుల బృందం సోమవారం రాత్రి 8.45గంటలకు సంప్రదాయరీతిలో ఆరంభించనున్నారు. ముందుగా స్వామివారిని గజవాహనసేవలో, అమ్మవారిని పుష్పామాలంకృత పల్లకి సేవలో తీర్చిదిద్ది ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. యాదగిరికొండపై అఖిలాండ బ్రహ్మాండకోటి నాయకుడు లక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారి బ్రహ్మోత్సవ కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. కల్యాణ వేదిక ముందు ప్రాంగణంలో బారికేడ్లతో గ్యాలరీలను నిర్మిస్తున్నారు. మీడియా, వీవీఐపీలు, దేవస్థాన సిబ్బందితో పాటు స్వామివారి బ్రహ్మోత్సవ కల్యాణ టికెట్లు కొనుగోలు చేసిన భక్తుల కోసం వేర్వేరుగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఈ గ్యాలరీలో సుమారు 3,500మంది పట్టేలా ధంగా ఏర్పాట్లు చేశారు. ఎనిమిది ఎల్‌ఈడీ టీవీల్లో నాలుగు కల్యాణ వేదిక ప్రాంతంలో, ఒకటి తూర్పు రాజగోపురం ముందు, ఒకటి దర్శన క్యూకాంప్లెక్స్ ముందు, రెండు కొండపైన బస్టాండ్ ప్రాంతంలో అమర్చనున్నారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసే భక్తులకు సరిపడా ప్రసాదాలను సిద్ధం చేశారు. కొండకింద ఉచిత అన్నదాన భవనంలో అన్నప్రసాదాల వితరణ చేయనున్నారు. సుమారు 350 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా, తిరుకల్యాణ వేడుకల్లో పాల్గొనేందుకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా సీఎంతో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారికంగా వచ్చే అవకాశాలు లేవు.



ఎదుర్కోలు మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా ఎదుర్కోలు మహోత్సవం

నృసింహుడి బ్రహ్మోత్సవ తిరుకల్యాణ సుముహూర్త నిర్ణయ ఘట్టం ఎదుర్కోలు మహోత్సవం ఆదివారం రాత్రి ప్రధానాలయ తూర్పు తిరుమాడ వీధిలో నేత్రపర్వంగా కొనసాగింది. దివ్యాలంకార శోభితుడైన నృసింహుడిని అశ్వవాహనంపై అధిరోహించి, పల్లకి సేవలో మహాలక్ష్మీ అమ్మవారిని అలంకరించిన ఆచార్యులు ఆలయ తిరువీధుల్లో ఊరేగింపుగా తూర్పు పంచతల రాజగోపురం వద్దకు తీసుకువచ్చి ఎదుర్కోలు నిర్వహించారు.

పంటకు నిప్పు

» ఆరుగాలం శ్రమ వృథా » పంట నష్టపోయిన అన్నదాతలు
» నల్లగొండ జిల్లా మిర్యాలగూడ యాద్గార్‌పల్లిలో ఘటన

మిర్యాలగూడరూరల్, మార్చి 17: పంటలు ఎండి ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు ఎండుతుండగా, వాటికి నీరందించలేక, ఎండిన పంటను కాపాడుకోలేక అన్నదాతలు పైరుకు నిప్పంటించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని మిర్యాలగూడ మండలంలో బోర్లు బావుల కింద రైతులు వరిసాగు చేశారు. చివరి దశలో ఒక్క తడి నీరందిస్తే చేతికొచ్చే పంట నిలువునా ఎండుతుండటంతో ఆవేదన చెందిన రైతులు మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఆదివారం వరి పంటకు నిప్పటించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన చిన్నకారు రైతులు మల్లెబోయిన సైదులు ఐదు ఎకరాలు, బంటు లక్ష్మయ్య నాలుగు ఎకరాలు, తిప్పన ప్రతాప్ మూడు ఎకరాలు బోరు బావుల కింద సాగు చేశారు. కానీ సాగర్ నీరందక బోరు బావులు వట్టిపోతుండటంతో సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో ఆవేదన చెంది పంటకు నిప్పటించారు. ప్రభుత్వం వారబందీ విధానంలో సాగునీరు అందిస్తుందన్న ఆశతో పాటు బోర్లను నమ్ముకొని సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



యాద్గార్‌పల్లిలోఎండిపోయిన పంటను తగులబెడుతున్న రైతు సైదులు

ప్రశాంతంగా రాస్తే
'పది'లో పది జీపీఏ

టెన్త్ విద్యార్థులకు టిప్స్
మోటివేషన్ స్పీకర్ సుదర్శన్





నిడమనూరు, మార్చి 17: విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాస్తే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మోటివేషన్ స్పీకర్ నూనె సుదర్శన్ అన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు.

- కొత్త విషయాలను పరీక్ష సమయంలో చదవకుండా, చదివిన విషయాలను మాత్రమే రివిజన్ చేసుకోవాలి.
- రివిజన్ చేసిన తర్వాత కళ్లు మూసుకుని మరోసారి మననం చేసుకోవాలి.
- పరీక్షల సమయంలో విద్యార్థులకు సరైన నిద్ర, మంచి ఆహారం తీసుకోవడం ముఖ్యం.
- జంక్ ఫుడ్ జోలికి అస్సలు వెళ్లవద్దు.
- క్రికెట్, కేబుల్ టీవీ, చాటింగ్, సినిమా, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి.
- సూర్యోదయం కంటే ముందే లేచి చదవుకోవడం వల్ల చాలా విషయాలు బాగా గుర్తుంటాయి.
- పరీక్షా హాల్లో చికాకు కలిగించే దుస్తులు ధరించవద్దు, సౌకర్యంగా ఉండే దుస్తులే వేసుకోవాలి.
- పరీక్షా కేంద్రానికి ఓ గంట ముందే వెళితే మంచిది.
- పరీక్షా హాల్లోకి అనుమతించిన వెంటనే వెళ్లి ప్రశాంతంగా కూర్చోవాలి.
- కళ్లు మూసుకుని పది నిమిషాలు ప్రశాంతంగా మెడిటేషన్ చేసుకోవాలి.
- ఇన్విజిలేటర్లు ఇచ్చిన సలహాలు,సూచనలు పాటించాలి.
- పరీక్షాహాల్లో ఇతరవిద్యార్థులతో సంభాషించకూడదు.
- మీకు వచ్చిన సమాధానాలు ముందుగా రాయాలి.
- తర్వాత కొద్దిగా ఆలోచిస్తే రాయగలిగే ప్రశ్నలకు సమాధానాలు రాయవచ్చు.
- చివరగా అన్ని ప్రశ్నలను పూర్తి చేసే విధంగా మీ జ్ఞానాన్ని ప్రదర్శించాలి.
- ఏ ఒక్క సమాధానాన్ని కూడా రాయకుండా వదిలేయకూడదు.
- పరీక్ష అయిపోయిన తర్వాత మరోసారి అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాశారా లేదా అని ఓసారి చెక్ చేసుకోవాలి.
- పరీక్షఅయిపోయిన తర్వాత ట్రిపుల్‌ఆర్‌ను పాటించాలి
- పరీక్ష అయిపోగానే ఇంటికి వచ్చి కాసేపు విశ్రాంతి (రెస్ట్) తీసుకోవాలి. మళ్లీ (రీడ్) చదువుకోవాలి, చదివిన విషయాన్ని (విజన్) పునఃశ్చరణ చేసుకుని తర్వాతి పరీక్షకు సిద్ధం కావాలి. అన్ని పరీక్షలు అయిపోయేవరకు బయట తిరగకూడదు. పరీక్షలు పూర్తయ్యేవరకు ప్రతీ రోజు కొద్దిసేపు మెడిటేషన్, యోగా చేస్తూ ప్రశాంతంగా ఉండాలి. విద్యార్థులు పదో తరగతిలో కష్టంగా కాకుండా ఇష్టంగా పరీక్షలు రాసి పదికి పది జీపీఏ తెచ్చుకోవచ్చు.

న్యాయం చేయాలని బాధితుల ఆందోళన

చౌటుప్పల్ రూరల్ మార్చి 17: రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన మోసానికి అనేక మంది ప్రజలు రోడ్డునపడ్డారు. తమకు న్యాయం చేయాలని బాధితులు ఆదివారం వెంచర్ వద్ద ఆందోళన నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట శివారులోని సర్వే నెంబర్ 21, 23, 33లలో 2000 సంవత్సరంలో 40 ఎకరాల్లో గ్రీన్ స్టార్ హౌసింగ్ ఎస్టేట్ ప్రైవేటు లిమిటెడ్ పేరిట డెవలప్‌మెంట్ వెంచర్ ఏర్పాటు చేశారు. వెంచర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలతో పాటు హైదరాబాద్‌కు చెందిన అనేక మంది మధ్యతరగతి ప్రజలు వాయిదాల పద్ధతిలో ప్లాట్లు కొనుగోలు చేశారు. ప్లాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు కూడా జరిగాయి. పట్టాదారు, వెంచర్ యజమానుల మధ్యన విభేదాలు ప్లాట్ల యజమానులకు శాపంగా మారాయి. తాము భూమి అమ్మలేదని పట్టాదారుడు ఇటీవల ప్లాట్లను స్వాధీనం చేసుకొని 12 ఎకరాల చుట్టు ప్రహరీ నిర్మించాడు. వెంచర్‌లోకి వెళ్లగానే కాపాలాదారులు కుక్కలను వదులుతున్నారని, పోలీసులతో బెదిరిస్తున్నారని బాధితులు వాపోయారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన మోసానికి తాము బలయ్యామని బాధితులు లబోదిబోమంటున్నారు. తమకు జరిగిన అన్యాయంపై ఎవరికి ఫిర్యాదు చేసిన న్యాయం జరగడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.



తూప్రాన్‌పేటలో ఆందోళన చేస్తున్న భాదితులు

లారీ బోల్తా... డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నర్సంపేట టౌన్, మార్చి 17 : ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి అదుపుతప్పి లారీ బోల్తాపడగా లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన నర్సంపేట మండలం ముత్తోజిపేట గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మల్లంపల్లి నుంచి నర్సంపేట వైపు వస్తున్న లారీ నర్సంపేట మండలం ముత్తోజిపేట గ్రామ శివారులోకి రాగానే, ఎదురుగా వచ్చిన స్కూటీని తప్పించబోయి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో లారీ డ్రైవర్ నల్గొండ జిల్లా దామెరకొండ గ్రామానికి చెందిన బిజిలి గంగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గంగయ్యను చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



బోల్తా పడిన లారీ

రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదు

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వేములపల్లి, మిర్యాలగూడ రూరల్, మార్చి 17: ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులోని పలు రైస్ మిల్లులను ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంత రం ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్ ప్రారంభంలో ధాన్యాన్ని రూ.2,700కు పైగా కొనుగోలు చేసి పంట నూర్పిడి పుంజుకోగానే ఒక్కసారిగా ధర తగ్గించడం సమంజసం కాదన్నారు. రైతులు ధాన్యం తీసుకోని వచ్చినప్పుడు మిల్లు గేట్లు తెరవకుండా బయటనే ఉంచి గుమాస్తాలు అసభ్య పదజాలం వాడటం సరికాదన్నారు. పక్క రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా ఆయకట్టు పరిధిలోని ధాన్యాన్ని రూ.2500కు తగ్గకుండా కొనుగోలు చేయాలని మిల్లర్లను కోరారు. నాణ్యమైన ధాన్యానికి గరిష్ఠ మద్దతు ధరను అందించాలని కోరారు. కొద్ది రోజులుగా ధాన్యం కొనుగోలు ధరకు సంబంధించిన రశీదులు చూపించాలని కోరినా మిల్లర్లు చూపించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీటీసీ బెజ్జం సాయి, రైతులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

తాగునీటి ఎద్దడి లేకుండా
చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే బాలునాయక్


ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మార్చి 17: దేవరకొండ నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలు సరిపడా కురియకపోవడంతో వేసవిలో నీటి సమస్య ఏర్పడే పరిస్థితి ఉందని అన్నారు. ముందస్తుగానే నీటి పారుదలశాఖ, భగీరథ అధికారులతో సమీక్షించారు. ఏఏ గ్రామాల్లో నీటిఎద్దడి తీవ్రతరంగా ఉందో తెలుసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ. 5.28 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, గ్రామీణ నీటిపారుదలశాఖ అధికారులు నీటి సమస్య ఉంటే పరిష్కరించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సరిపడా మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని అధికారులను కోరారు. చెడిపోయిన బోర్లకు మరమ్మతులు, నూతనంగా బోర్లు వేయడంతో పాటు గ్రామానికి దగ్గరలో ఉన్న బోరు, బావులు లీజుకు తీసుకొని నీటిని సరఫరా చేసేందుకు కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లో సమస్య ఉందని ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే అధికారులు పరిష్కరించాలని కోరారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు అదనంగా నిధులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. మంచినీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గంలోని అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాసిన కేసీఆర్

● ఎమ్మెల్యే వేముల వీరేశం


ఐఎన్‌టీయూసీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, మార్చి 17: మాజీ సీఎం కేసీఆర్ కార్మికుల హక్కులను ఉక్కుపాదంతో అణిచివేశారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లిలో ఆదివారం జరిగిన టీఎస్‌ఆర్టీసీ నల్లగొండ రీజియన్ ఐఎన్‌టీయూసీ ఎస్‌డబ్ల్యూయూ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తమ హక్కుల కోసం పోరాడుతూనే సంస్థ పురోభివృద్ధికి కార్మిక సంఘాలు పాటుపడాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛాయుత పాలన కోరుకున్న కార్మిక వర్గాలు కాంగ్రె‌స్‌కు మద్దతు పలకడంతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిందన్నారు. హక్కులను సాధించే క్రమంలో బాధ్యత కూడా గుర్తుచేయాలని, ఆ దిశగా ఐఎన్‌టీయూసీ ముందుకెళ్తుందని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. రీజియన్ పరిధిలో ఐఎన్‌టీయూసీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వ నిరంకుశత్వంతో ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన చెందారు. మూసివేత దశకు చేరుకున్న నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపో పూర్వ వైభవానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో తనవంతు కృషి చేస్తామని వీరేశం పునరుద్ఘాటించారు. బస్సుల సంఖ్యను కూడా పెంచుతామని చెప్పారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మిక సంఘాలను బెదిరించి నిర్వీర్యం చేసినా కార్మికుల పక్షాన ఐఎన్‌టీయూసీ రాజీలేని పోరాటం చేసిందన్నారు. సంస్థ, ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా తమ కార్యకలాపాలు ఉంటాయని, ఉద్యోగులకు భరోసానిచ్చే విధంగా సంఘం పని చేస్తుందని ఉద్యోగులు కూడా సంఘం బలోపేతానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, సిద్దగోని స్వామిగౌడ్, నేతకాని కృష్ణయ్య, వేముల నర్సింహ, ప్రజ్ఞాపురం సత్తి, సమద్, పృథ్వీ, మురళి, యాదయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు కత్తుల యాదయ్య, యారి చంద్రయ్య, శేఖర్, భూషణ్, నరేంద్రకుమార్, కేవీ రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

బత్తాయి రైతులు సంఘటితం కావాలి

● ఉద్యానవన శాఖ ఏడీ సంగీతలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ ఏడీ సంగీతలక్ష్మి

నల్లగొండ టౌన్, మార్చి 17: బత్తాయి పండించే రైతులు సంఘటితం కావాలని ఉద్యానవన శాఖ ఏడీ సంగీతలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బత్తాయి రైతుల సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బత్తాయి డిమాండ్‌కు అనుగుణంగా రైతులకు గిట్టుబాటు ధర రావాల్సి ఉండటంతో దానిపై చర్చ నిర్వహించాలనే ఉద్దేశ్యంతో సదస్సును నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. రైతులందరూ సంఘటితమై ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌ను డెవలప్ చేయాలన్నారు. జిల్లాకు క్లస్టర్ డెవలప్‌మెంట్‌ను తీసుకురావాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి లేఖ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇది అమలైతే మొక్కల నుంచి ప్యాకేజీ వరకు రైతులు మంచి ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శాస్త్రవేత్తలు సురేష్‌రెడ్డి, సుబ్బారావు, వినయ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


సదస్సుకు హాజరైన రైతులు

రేవంత్‌రెడ్డి పాలనకు పెరుగుతున్న ప్రజాదరణ

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న జక్కలి ఐలయ్యయాదవ్

మునుగోడు, మార్చి 17: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ప్రజాపాలనకు ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ అన్నారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో తెలుగునాడు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోసుకొండ వెంకటేష్‌లతో కలిసి ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 100 రోజుల్లోనే నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు అనుకూలత చూపుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలనకంటూ మించిన అధ్వానంగా పక్క రాష్ట్రం ఏపీలో వైసీపీ పాలన ఉండటంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని... ఏపీలో ప్రస్తుతం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించటం ఖాయమన్నారు. కేసీఆర్‌కు పట్టిన గతే జగన్‌కు పడుతోందని, ఘోరమైన ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో 20ఏళ్ల క్రితం అధికారం చేపట్టిన టీడీపీకి బలమైన క్యాడర్‌తో ప్రజాదరణ ఉందన్నారు. తాజాగా పదేళ్ల పాలన సాగించి ఓటమి పాలైన బీఆర్ఎస్‌కు మాత్రం మూడు నెలల్లోనే కేడర్ లేక మునిగిపోయే పరిస్థితిని ఎదుర్కొంటుందని ఎద్దేవా చేశారు. అవినీతి, అక్రమాలు, మోసపూరిత పునాదులతో అధికారం చేపట్టి వ్యతిరేక పాలన సాగించిన పార్టీలు నేతలకు మనుగడ ఉండదని చెప్పటానికి తెలుగు రాష్ట్రాల్లో బీఆర్ఎస్, వైసీపీలు ఉదాహరణగా చేసుకోవచ్చని అన్నారు.

ప్రజలు సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో టీటీడీపీ నేతలు మక్కెన అప్పారావు, కోలను వేణుగోపాల్‌రెడ్డి, మునుగోడు, గట్టుప్పల పార్టీల మండల అధ్యక్షులు పొడపంగి సైదులు, నెట్టు శ్రీకాంత్, గణేష్, మురళి, వినయ్, లక్ష్మీనారాయణ, యాదయ్య, నర్సింహ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు


మర్రిగూడలో దిమ్మెలకు ముసుగులు కప్పుతున్న సిబ్బంది

నిడమనూరు, మర్రిగూడ, మార్చి 17: సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో అధికారులు అంతటా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలుచేస్తున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నిడమనూరు, మర్రిగూడ మండలాల్లో పార్లమెంటు ఎన్నికల కోడ్ నేటినుంచి అమలులోకి రావడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఉన్నటువంటి రాజకీయ దిమ్మెలకు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. రాజకీయ పార్టీల ప్రకటనలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లు కూడా ఆదివారం తొలగించారు. వివిధ పార్టీల జెండాల దిమ్మెలకు ముసుగులు తొడిగారు. గోడలపై ఉన్న రాజకీయపార్టీలకు సంబంధించిన రాతలను చెరిపేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఉన్న జాతీయ నాయకులు బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలతో పాటు టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి కూడా వస్త్రాలతో ముసుగులు తొడిగారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడే వరకు అంటే జూన్ 6వ తేదీ వరకు ఈ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఏ ఒక్కరూ కోడ్ నిబంధనలను ఉల్లఘించినట్లయితే కఠినమైన చర్యలు తీసుకుంటామని మర్రిగూడ ఎంపీడీవో మున్నయ్య తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


యాద్గార్‌పల్లిలో ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, మార్చి 17: వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరుబావుల కింద సాగు సాగుచేసిన వరి పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఆదివారం నీరందక ఎండిపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ఎకరానికి రూ.30వేల పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు తీరా పొట్టదశలో నీరందక ఎండిపోయాయయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి వ్యవసాయశాఖ అధికారుల ద్వారా పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరానికి రూ. 20 వేల నష్ట పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నీటికోసం మూగజీవాలు విలవిల


గుంతలో నీటిని తాగుతున్న జీవాలు

దామరచర్ల, మార్చి 17: గుక్కెడు నీటికోసం మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. వేసవికి ముందు నుంచే నీటి సమస్య మండలంలో తీవ్రం కావడంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. దీంతో తాగునీటికి మూగజీవాలు అవస్థలు పడుతున్నాయి. ఉదయం ఇంటి నుంచి అడవికి తోలుకెళ్లిన పశువులను తిరిగి ఇంటికి వస్తేనే నీళ్లు. దీంతో పశువుల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. గొర్రెల కాపరులు పరిస్థితి దారుణంగా ఉంది. జీవాలకు నీటికోసం తిప్పలు తప్పడం లేదు. రైతులను బతిమలాడి వ్యవసాయ బోర్ల నుంచి సమీపంలోని గుంతలు నింపుకొని జీవాలకు తాగునీటిని అందిస్తున్నారు. అధికారులు తక్షణమే చెరువులు నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దర్వేశిపురం ఎల్లమ్మకు డీఎస్పీ పూజలు

కనగల్, మార్చి 17: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయాన్ని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను జరిపించారు. అర్చకులు డీఎస్పీ పేరిట గోత్ర నామార్చలను నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వచనాలను తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ సిబ్బంది డీఎస్పీకి శాలువా కప్పి సత్కరించారు.


యక్షగాన ప్రదర్శన చేస్తున్న కళాకారులు

చిందు కళాకారుల యక్షగాన ప్రదర్శన

మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం గడ్డం శంకరయ్య ఆధ్వర్యంలో చిందు కళాకారుల బృందం సభ్యులు యక్షగాన ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా శశిరేఖ పరిణయ ఘట్టం నాటక ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుటుంది. అభిమన్యుడు, శశిరేఖ, బలరాముడు, రేవతి, ఘటోత్కజుడి పాత్రలు అలరించాయి. కార్యక్రమంలో చిందు కళాకారులు రామస్వామి, శేషాద్రి, నర్సింహ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కవితను వెంటనే విడుదల చేయాలి

శాలిగౌరారం, మార్చి 17: ఎమ్మెల్సీ కవితను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అయితగోని వెంకన్నగౌడ్, చాడ సతీష్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. కవిత అక్రమ అరెస్టుతో రాబోయే ఎన్నికల్లో బీజేపీకి నష్టం జరుగుతుందని, కావాలనే కేసులో ఇరికించారని ఆరోపించారు. తెలంగాణ కోసం ఉద్యమాలు, పోరాటాలు చేశామని, అక్రమ అరెస్టులతో భయపడేది ఏమి లేదన్నారు. కవిత అక్రమ అరెస్టును పార్టీ మండల తరఫున తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండా శ్రీనివాస్, శేఖర్‌బాబు, దుబ్బ వెంకన్న, దాసరి థానియల్, శ్రీనివాస్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పది పరీక్షలు

మర్రిగూడ, శాలిగౌరారం, దేవరకొండ, మార్చి 17: పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని, నేటి నుంచి పరీక్షలు జరగనున్నందున పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. మర్రిగూడ మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదర్శ స్కూల్‌లో 134మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులు, మొత్తం 294మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. సోమవారం నుంచి ప్రారంభమవుతున్న పరీక్షలకు విద్యార్థులు గంటలోపే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. రెండు పరీక్ష కేంద్రాల సీఎస్‌లు మదు, పద్మాచారిలు తెలిపారు.

● పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శాలిగౌరారం ఎంఈవో మేక నాగయ్య తెలిపారు. మండలంలో 350 మంది విద్యార్థులకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాలిగౌరారంలోని జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 130మంది, గీతాంజలి స్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో 120 మంది, మాదారం(కలాన్) పరీక్ష కేంద్రంలో 100మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. 20 మంది సిబ్బందిని నియమించినట్లు నాగయ్య తెలిపారు. విద్యార్థులు అర్ధగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ పాల్పడే విద్యార్థులను డీబార్ చేస్తామని హెచ్చరించారు.

● దేవరకొండలో పది పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

పౌరసత్వ సవరణ సిగ్గు చేటు : వ్యకాస

మాడ్గులపల్లి, మార్చి 17: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం అమలుకు పూనుకోవడం సిగ్గుచేటని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. మండలంలోని కుక్కడం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ప్రజా సంఘాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో ఆకలి, నిరుద్యోగం, ధరల పెరుగుదలతో పాటు దళితులు, మైనార్టీలు, మహిళలపై దాడులు, మణిపూర్ హింస వంటివి జరిగాయని, సీఏఏ అమలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ హిందూ ఓటర్లను ప్రభావితం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సీఏఏను ముందుకు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జ చిన్నవెంకులు, రొండి శ్రీనివాస్, బొంగరాల వెంకటయ్య, బొంగరాల ఎల్లయ్య, నారాయణరెడ్డి, లక్ష్మి, విజయ, రాములమ్మ, లక్ష్మమ్మ, ముత్యాలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శశాంక్

శాలిగౌరారం, మార్చి 17: స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ యర్ర శంభులింగారెడ్డి కోరారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ఐకాన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారి సహకారంతో శాలిగౌరారంలోని జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరాన్ని జిల్లా చైర్‌పర్సన్ యర్ర శంభులింగారెడ్డి, ఆస్పత్రి ఎండీ ప్రదీప్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో గుండె, మెదడు, నరాలు, వెన్నుముక, గ్యాస్ట్రో, యూరో, ఆర్థో డాక్టర్లు పరీక్షలు నిర్వహించారు. దాదాపు 600 మందికి పరీక్షలు చేసి మందులు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు శశాంక్ కోడే, రవి శంకర్ కన్నా, సాయి మౌనిక, చెరుకూరి శశీంద్ర బచ్చు, రాజేంద్రప్రసాద్, మహేష్, వేమవరపు పవన్‌కుమార్, అశోక్‌గౌడ్, జీఎం ప్రవీణ్‌రెడ్డి, పీఆర్‌వో వెంకన్న, నాగరాజుగౌడ్, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు దునక వెంకన్న, నాయకులు మహేందర్‌రెడ్డి, అంజనేయులు, రామ్మూర్తి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: దేవరకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మూత్రశాలలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి రాకేష్ కోరారు. ఆదివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో మూత్రశాలలకు సౌకర్యం లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమీపంలోని సులబ్ కాంప్లెక్స్, బస్టాండ్‌కు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. పది పరీక్షలు ఉన్నందున మూత్రశాలలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఎలమల గోపిచంద్, యశ్వంత్, రాములు తెలిపారు.

చింతపల్లి: వికలాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా పెరికల సంఘం రాష్ట్ర నాయకుడు ముత్తినేని వీరయ్యను నియమించడంపై పెరిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంగిరేకుల గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా పెరిక కులస్తులను గౌరవించి రాష్ట్రంలో ఒక కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కు ఎమ్మెల్యే బాలునాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నార్కట్‌పల్లి: ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈటెల వెంకటేశ్వర్లు హర్షం వెలిబుచ్చారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండల శాలిలింగోటం గ్రామపంచాయతీ కార్యదర్శి చెట్టుపల్లి అశోక్ కుమార్‌ను పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా బండమీదిగూడెం పంచాయతీ కార్యదర్శి షేక్ సయ్యద్‌జాన్ జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శులు వీరికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

దేవరకొండ: దేవరకొండ మండల పరిధిలోని తాటికోలు, మైనంపల్లి, ముదిగొండ వాగుల నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని దేవరకొండ సీఐ నర్సింహులు అన్నారు. తాటికోలు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ శీనుపై కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. పెట్రోలింగ్ నిర్వహించి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నల్లగొండకల్చరల్: పద్మశాలి కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషించదగిన విషయమని నల్లగొండ జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి పొట్టబత్తుల సత్యనారాయణ, కర్నాటి యాదగిరి తెలిపారు. పద్మశాలీల అభివృద్ధికి తోడ్పాటు అందించి మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వానికి పలుమార్లు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించినా పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేబినేట్‌లో పద్మశాలీల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడంపై పద్మశాలీలు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

మిర్యాలగూడ రూరల్: కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శీతాకాలపు ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవ రోజు కొనసాగింది. యాద్గార్‌పల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వీధుల్లో కంపచెట్లను తొలగించి రోడ్లను, మురుగుకాల్వలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి మహాత్మాగాంధీ ఎన్ఎస్ఎస్ సెల్ విభాగం జూనియర్ అసిస్టెంట్ రామరాజు హరికిషన్‌రావు పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతపై చైతన్యం కల్పిస్తూ గ్రామ ప్రజలతో మమేకమై ఈ శిబిరంలో వలంటీర్లు పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.కోటయ్య, వలంటీర్లు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

మర్రిగూడ: ప్రతీ ఒక్కరూ భక్తి భావనలను అలవర్చుకున్నప్పుడే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్ అన్నారు. మండలంలోని బట్లపల్లి గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు పూజారి వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు మొక్కుబడులు, కానుకలను సమర్పించుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పందుల యాదయ్య, పందుల రాములు, పరమేష్, వెంకటేష్, నర్సింహలతో పలువురు ఉన్నారు.

మర్రిగూడ: ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామికమని మాజీ దళిత బంధు కమిటీ సభ్యుడు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు లపంగి నర్సింహ అన్నారు. బీజేపీ కక్షపూరితంగా కవితను అరెస్టు చేశారని, ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసమే అరెస్టు చేశారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు బీజేపీ చేస్తున్న ఆగడాలను చూస్తున్నారని, రేపు జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పక తప్పదని అన్నారు. సమావేశంలో ఇస్తారి, రామచంద్రం, జేపీ, వెంకటేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు: గుర్రంపోడు మండలం కాల్వపల్లి, శేరిపల్లి శివారులోని గిరిజనులు ఆరాధ్యదైవంగా కొలిచే శ్రీరాందాదా బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. అందుకుగాను ఆలయకమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా శ్రీరాందాదా దేవాలయానికి పేరుంది. ప్రతీ సంవత్సరం మార్చి నెలలో వారం రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. బ్రహ్మోత్సవాలకు మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, చందంపేట, నాగర్‌కర్నూల్ ప్రాంతాల నుంచి గిరిజనులు అధిక సంఖ్యలో వచ్చి దైవదర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకుంటారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు జాతర ఉత్సవాలు జరుగుతాయని ఆలయకమిటీ నిర్వాహకులు ధరంసింగ్, గోపాల్‌సింగ్, తుల్యానాయక్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోవాలని వారు కోరారు.

హాలియా: హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్‌లో భాగంగా హాలియా మునిసిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామంలో నిర్వహిస్తున్న వారం రోజుల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో గ్రామంలోని రామాలయం పరిసర ప్రాంతాలను విద్యార్థులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పిచ్చిమొక్కలను, చెత్తను తొలగించి శుభ్రం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సీహెచ్ రాజు, ఆలయ అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.